
సాక్షి
ఒడిశా
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 2,81,053
బంగారం	550 మిల్లీ గ్రాములు
వెండి	6 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ప్రపంచ శాంతికి కృషిచేద్దాం

ప్రపంచ దేశాల్లో అన్నిటికంటే భారతదేశ కళలు, సంస్కృతి గొప్పవని రాజయోగిని బ్రాహ్మకుమారి జయంతి చెప్పారు.

- 8లో



శ్లాబ్ కూలి వ్యక్తి మృతి

బరంపురం నగర సమీపంలోని సుర్లా గ్రామంలో శ్లాబ్ కూలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

- 8లో

న్యూస్‌రీల్

మాణికేశ్వరిదేవి సన్నిధిలో అన్నదానం



మాణికేశ్వరీదేవి

పర్లాకిమిడి: చైత్రమాస ఆఖరి మంగళవారం సందర్భంగా స్థానిక అంకావీధిలో రాజావారి ఇలవేల్పు మాణికేశ్వరీదేవి మందిరం ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బప్పి పట్నాయక్, బాబూరావు, కాశీనగర్ మాజీ సమితి చైర్మన్ ఛిత్రి సింహాద్రి, దారపు చిట్టి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం మార్చకపోతే ఎన్నికల బహిష్కరణే



బీడీఓతో మాట్లాడుతున్న లక్ష్మీపూర్ గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ సమితి లక్ష్మీపూర్ గ్రామస్తులు మంగళవారం బీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. 29వ నెంబర్ బూత్‌లో గత ఎన్నికలో 744 మంది ఓటర్లు ఉండేవారని, అయినప్పటికీ ఇక్కడి పోలింగ్ కేంద్రాన్ని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొయిపరిగుడ సమితి కాలనీ స్కూలుకు మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోనే పోలింగ్ కేంద్రం కొనసాగించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. కాగా, పోలింగ్ కేంద్రాల ఎంపిక సమయంలో ఎవరూ వ్యతిరేకించలేదని, ఇప్పుడు తామేమీ చేయలేమని బీడీఓ భాస్కరచంద్ర సాహు స్పష్టం చేశారు.

మంత్రి సరక, సుధీర్‌లపై కేసు నమోదు



జగన్నాథ సరక



సుధీర్‌దాస్

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి సుధీర్ దాస్‌లపై జిల్లాలోని అంబొదల పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. మునిగుడ సమితి రఘుబారి గ్రామానికి చెందిన హరేకృష్ణ బెహర, హరేంద్ర గౌడొలు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. ఈ నెల 14న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రితో పాటు సుధీర్‌దాస్, అతని అనుచరులు మునిగుడ సమితి రఘుబారి గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. నీటి ఎద్దడి సమస్య పరిష్కరించాలని గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో మంత్రిని నిలదీశారు. ఈ క్రమంలో మంత్రి, సుధీర్‌దాస్‌ల అనుచరులు కొందరు యువకులపై దాడి చేశారు. దీనిపై గ్రామస్తులంతా ఏకమై మంత్రి, అనుచరుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన హరేకృష్ణ బెహర, హరేంద్ర గౌడొలతో ఫిర్యాదు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



మృతి చెందిన ధీరెన్ నాయిక్

జయపురం: జయపురం- కొరాపుట్ 26వ జాతీయ రహదారి ఘాట్ రోడ్డులో అంబేడ్కర్ కళాశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగడ జిల్లా మునిగుడ ప్రాంతానికి చెందిన ధీరెన్ నాయిక్(28) తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. చిన్న కుమారుడైన ధీరెన్ తండ్రికి సపర్యలు చేస్తూ జయపురంలో ఉన్న తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ ఆస్పత్రికి రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం బైక్‌పై ఆస్పత్రికి వెళ్తుండగా కొరాపుట్ నుంచి జయపురం వెళ్తున్న టిప్పర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ధీరెన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• సివిల్స్‌లో అద్వితీయం



అనిమేష్ ప్రధాన్ (2వ ర్యాంక్)

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మంగళవారం ప్రకటించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలు - 2023లో ఒడిశాకు చెందిన అనిమేష్ ప్రధాన్ రెండో ర్యాంక్ సాధించారు. అనిమేష్ స్వస్థలం అంగుల్ జిల్లా తాల్చేర్ ప్రాంతంలోని భలుగాడియా. 2021లో ఎన్ఐటీ, రౌర్కెలా నుంచి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. కళింగ డీఏవీ పబ్లిక్ స్కూలు నుంచి 12వ తరగతిలో 98.8 శాతం మార్కులతో ఉన్నత ఉత్తీర్ణత సాధించారు. అనిమేష్‌తో పాటు రాష్ట్రం నుంచి ప్రజ్ఞానానందన్ గిరి (24), ఆయుషి ప్రధాన్ (36), జయశ్రీ ప్రధాన్(52), అమృతాంశు నాయక్(110), శుభ్ర పండా (204), రష్మీ ప్రధాన్ (319), బిస్వజిత్ పండా (343), సౌరవ్ దాస్ (466), రాకేష్ కుమార్ సాహు (575), నయన్ రంజన్ దాస్ (581), సిద్ధార్థ్ బెహ్రా(800) రాణించారు.

- భువనేశ్వర్

• తొలి కలశం @ రూ.24,500



కలశం దక్కించుకున్న సోనాలి

ఏకామ్ర క్షేత్రం శ్రీలింగరాజు మహా ప్రభువు వార్షిక రుకుణ రథయాత్ర పురస్కరించుకుని ముక్తేశ్వర ఆలయ ప్రాంగణంలో మారీచ్‌కుండ్ జలం వేలం వేశారు. మహా ప్రభువు రుకుణ రథం ప్రతిష్ట కోసం వినియోగించే ఈ జలం తొలి కలశం రూ.24,500 పలికింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లా కృష్ణదాస్‌పూర్ ప్రాంతానికి చెందిన మన్మోహన్ బారిక్ భార్య సోనాలి తొలి కలశం దక్కించుకున్నారు. ఈ జలంతో స్నానం ఆచరిస్తే సంతానం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. తొలి 3 కలశాల జలం కోసం పోటాపోటీగా వేలం నిర్వహిస్తారు. పోటీకి విచ్చేసిన మిగిలిన దంపతులకు దేవస్థానం నిర్ధారించిన ధరకు జలం విక్రయించారు.

- భువనేశ్వర్

• చిన్నారి దేవతలు



జట్నీ కుదియారి జగుల్లై మాత వసంత నవ రాత్రి ఉత్సవాల్లో తొమ్మిది మంది చిన్నారులు నవ దుర్గల అలంకరణలో ఆకట్టుకున్నారు. మంగళవారం గ్రామ దేవత సిద్ధి ధాత్రి అలంకరణలో షోడశోపచార పూజలు అందుకున్నారు. మహా సప్త శతి పూజతో ఉత్సవ ప్రాంగణంలో మంత్ర పఠనంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

- భువనేశ్వర్

ఇంటి నుంచే ఓటు



బ్రజమోహన్ చక్రవర్తిని సత్కరించిన రిటర్నింగ్ అధికారి ప్రతాప్ చంద్ర బెవురా

- వయో వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధికారులు
- పలుచోట్ల శతాధిక ఓటర్లకు సత్కారం



భువనేశ్వర్: ఈ ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో వయో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఏర్పాట్లు చేస్తోంది. 85 ఏళ్లు పైబడిన పౌరులు, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులు ఇంటి నుంచి బయటకు రావాల్సిన అవసరం లేకుండా ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ విషయంలో ఖుర్దా జిల్లా యంత్రాంగం ముందంజలో ఉంది. రిటర్నింగ్ అధికారులు వృద్ధ ఓటర్ల ఇంటికి ప్రత్యేక ఆహ్వానంతో వెళ్లి సత్కరించి ఓటు వేసేలా ప్రోత్సహిస్తున్నారు. అత్యధిక ఓటింగే లక్ష్యంగా అధికారులు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓటింగ్ శాతం పెంపే లక్ష్యంగా..

ఈసీఐ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఇంటి నుంచి ఓటింగ్ సదుపాయాన్ని పొందగల 85 ఏళ్లు పైబడిన ఓటర్ల సంఖ్య 3,02,248. వీరిలో 1,40,117 మంది పురుషులు, 1,62,128 మంది మహిళలు, ముగ్గురు తృతీయ లింగ వ్యక్తులు ఉన్నారు. దివ్యాంగులకు సంబంధించి రాష్ట్రంలో 5,22,805 మంది ఓటర్లు ఉండగా 2,97,514 మంది పురుషులు, 2,25,242 మంది మహిళలు, 49 మంది తృతీయ లింగ ఓటర్లు ఉన్నారు.



ఖుర్దా జిల్లాలో రిటర్నింగు అధికారులకు ఫారమ్- 12డీ పంపిణీ

హోమ్ ఓటింగ్ సదుపాయం ఇలా..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన 5 రోజులలోపు అర్హులైన ఓటర్లు ఫారం-12డీ నింపి రిటర్నింగ్ అధికారికి దాఖలు చేయాలి. దివ్యాంగ ఓటర్లు తమ దరఖాస్తులతో బేస్‌లైన్ వైకల్య ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. దీనిని పరిశీలించే బాధ్యత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)కి అప్పగించారు.

అభ్యర్థులకు ఓటరు జాబితా

జవాబుదారీతనం, పారదర్శకతను కొనసాగించడానికి సంబంధిత నియోజకవర్గంలోని అభ్యర్థులందరికీ ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచుతారు. వారి అభీష్టం మేరకు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఒక ప్రతినిధిని ఎంచుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఫారం 12డి సమర్పించిన తర్వాత ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉండటానికి వీలు కల్పిస్తూ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో ముందస్తుగా సమాచారం అందజేస్తారు. ఓటర్లు తమ ఇంటి నుంచి ఓటు వేసేందుకు వీలుగా అనుబంధ సమాచారాన్ని ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. ప్రత్యేక పోలింగ్ అధికారుల బృందం, భద్రతా అధికారులు ఓటరు నివాసాన్ని సందర్శించి వారి ఓట్లను సేకరిస్తారు. పారదర్శకత కోసం ఈ ప్రక్రియను వీడియో తీస్తారు.

ప్రక్రియ ప్రారంభం..

85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇప్పటికే తొలి దశ, మలి దశ ఎన్నికలు పురస్కరించుకుని ఇంటి వద్ద నుంచి తమ ఓటు వేయడం ప్రారంభించారు. రాజస్థాన్‌లోని చురు ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసినట్లు ఈసీఐ సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్, సుక్మా గిరిజన జిల్లాలకు చెందిన 87 ఏళ్ల ఇందుమతి పాండే, 86 ఏళ్ల సోన్మతి బాఘేల్ ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ఓటు వేశారు. మహారాష్ట్రలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గడ్చిరోలి జిల్లా సిరోంచ పట్టణంలో ఇద్దరు వృద్ధ ఓటర్లకు ఇంటి నుంచి ఓటు వేసే సౌకర్యం ఈసీఐ విజయవంతంగా కల్పించింది.




శశిధర్ మిశ్రాకు ఓటింగ్ ఆహ్వాన పత్రం అందజేసిన రిటర్నింగ్ అధికారి చిన్మయ ఆచార్య

శతాధిక ఓటర్లకు సత్కారం

ఖుర్దా జిల్లాలో ఇంటి నుంచి ఓటు ప్రక్రియ ఆరంభమైంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు, ఎన్నికల అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వందేళ్లు దాటిన ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు వేసేందుకు ఆహ్వాన పత్రిక అందజేసి సత్కరించారు. 112వ నంబరు పోలింగు కేంద్రం భువనేశ్వర్ (మధ్య) శాసనసభ నియోజక వర్గం పరిధి యూనిట్- 4 ప్రాంతంలో ఉంటున్న బ్రజమోహన్ చక్రవర్తి, 114వ నంబరు పోలింగు కేంద్రం భువనేశ్వర్ ఏకామ్ర నియోజకవర్గం, బీజేబీ నగర్ ప్రాంతంలో ఉంటున్న శశిధర మిశ్రాకు ఆయా ప్రాంతాల రిటర్నింగు అధికారులు ప్రతాప్ చంద్ర బెవురా, చిన్మయ ఆచార్య ఆహ్వాన పత్రం అందజేసి సత్కరించి జిల్లాలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

- ఖుర్దా జిల్లా భువనేశ్వర్ (మధ్య), భువనేశ్వర్ (ఉత్తర), భువనేశ్వర్ ఏకామ్ర, జయదేవ్, జట్నీ, బెగుణియా, ఖుర్దా, చిలికా 8 శాసనసభ నియోజక వర్గాల్లో 504 మంది శతాధిక ఓటర్లు ఉన్నారు. వీరిలో 263 మంది పురుషులు, 241 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. 85 ఏళ్లు నుంచి 100 ఏళ్ల పరిమితిలో వృద్ధ ఓటర్లు 17,532 మంది. వీరిలో 9,486 మంది పురుషులు, 8045 మంది మహిళలు, ఒక తృతీయ లింగ ఓటరు ఉన్నారు.
- జిల్లా వ్యాప్తంగా 32,006 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. వీరిలో 19,218 మంది పురుషులు, 12, 787 మంది మహిళలు, ఒక తృతీయ లింగ ఓటరు ఉన్నారు. వీరంతా వారి అభీష్టం మేరకు ఇంటి వద్ద నుంచి గానీ, పోలింగు కేంద్రం సందర్శించి గానీ ఓటు వేయవచ్చు. ఈ సౌలభ్యం కల్పించేందుకు ఫారమ్-12డి పంపిణీ చేశారు.

తరతరణీ పాహిమాం!



తరతరణి అమ్మవారు కొలువుదీరిన కొండ



మెట్ల మార్గం గుండా వెళ్తున్న భక్తులు



కిక్కిరిసిన భక్తజనం



కొండపై మహాదుర్గా అవతారంలో తరతరణి అమ్మవారు

- శక్తిపీఠానికి పోటెత్తిన భక్తజనం
- ప్రత్యేక ఏర్పాట్లు కమిటీ సభ్యులు

బరంపురం : చైత్రమాస ఆఖరి మంగళవారం సందర్భంగా దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం, శక్తి పీఠం, రుశికుల్యా నదీ తీరం పక్కన కొండపై కొలువుదీరిన తరతరణి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఒడిశాతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు ఐదు లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తలనీలాలు అర్పించి అమ్మవారికి కానుకలు సమర్పించారు. కొండ దిగువన వంటా వార్పులు చేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి విందుభోజనాలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశరాఉ. ట్రాఫిక్, శాంతిభద్రతల పరిరక్షణకు డీఎస్పీ స్థాయి అధికారితో పాటు 10 మంది ఎస్ఐలు, 100 మంది కానిస్టేబుళ్లను నియమించినట్లు గంజాం ఎస్పీ జగమోహన్ మీనా తెలిపారు. మంగళవారం ఉదయం తొలి పూజగా జిల్లా పాలనా యంత్రాంగం ఉన్నత అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. కమిటి ఎగ్జిక్యూటివ్ అధికారి తిరుమల రెడ్డి, కార్యదర్శి ప్రమోద్ కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల తలనీలాలు అర్పిస్తూ..

బీజేపీ రెండో జాబితా విడుదల



అభ్యర్థులు వీరే..

రూర్కెలా-దిలీప్ రాయ్, పట్నా (ఎస్టీ) - అఖిల చంద్ర నాయక్, సారాసాకొనా (ఎస్టీ) - భాదవ్ హంసద, రాయరంగ్‌పూర్ (ఎస్టీ)-జోలెన్ బర్దా, బంగ్రిపోసి (ఎస్టీ)- సంజలి ముర్ము, కరంజియా (ఎస్టీ)- పద్మ చరణ్ హైబ్రూ, జోరిగం (ఎస్టీ) - నర్సింగ్ భాత్రా, డాబుగాంవ్ (ఎస్టీ) - సోమనాథ్ పూజారి, రాజ్‌నగర్ - లలిత్ బెహెరా, బల్లికుదా ఎరసమ - సత్య సారధి మహంతి, జగత్‌సింగ్‌పూర్ - అమరేంద్ర దాష్, కాకత్‌పూర్ (ఇ) - బైదర్ మల్లిక్, రౌణొపూర్ - సురమా పాఢి, సన్నొఖెముండి - ఉత్తమ్‌కుమార్ పాణిగ్రాహి, మోహన (ఎస్టీ) - ప్రశాంత మల్లిక్, బిస్సామ్ కటక్ (ఎస్టీ) - జగన్నాథ్ నంద్రుక, రాయగడ (ఎస్టీ)- బసంత కుమార్ ఉలాకా, లక్ష్మీపూర్ (ఎస్టీ) - కై లాష్ కులేసికా, కోట్‌పాడ్ (ఎస్టీ)- రూపు భాత్రా, పొట్టంగి (ఎస్టీ) - చైతన్య నందిబాలి, చిత్రకొండ (ఎస్టీ) - డంబురు సిస.

భువనేశ్వర్: రాష్ట్రంలో మరో 21 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను భారతీయ జనతా పార్టీ మంగళ వారం ప్రకటించింది. రౌర్కెలా అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మాజీ శాసన సభ్యుడు దిలీప్ రాయ్, రౌణొపూర్ నుంచి సురమా పాఢి, చిత్రకొండ నుంచి డంబురు సిస, సన్నొఖెముండి నుంచి ఉత్తమ్ పాణిగ్రాహి, పొట్టంగి నుంచి చైతన్య నందిబాలి, బంగిరిపోషి నుంచి సంజలీ ముర్ము అభ్యర్థులుగా ఖరారయ్యారు. 70 ఏళ్ల దిలీప్ రాయ్ 2018 నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. బొగ్గు కుంభకోణం కేసులో ఢిల్లీ హైకోర్టు అతనిపై శిక్షను ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసి ఎన్నికల్లో పోటీకి అనుమతించిన విషయం తెలిసిందే. ఈ తీర్పుతో రౌర్కెలా మాజీ శాసన సభ్యుడు తన రాజకీయ జీవితాన్ని పునరుద్ధరించారు. సుందర్‌గఢ్ లోక్‌సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి జుయల్ ఓరమ్, బీజేడీ అభ్యర్థిగా హాకీ స్టార్ దిలీప్ టిర్కీ మధ్య జరగనున్న హై-వోల్టేజీ పోరులో దిలీప్ రాయ్ బరిలోకి ప్రత్యక్షంగా దిగడం ఎన్నికల పోరుని రసవత్తరం చేస్తుందని భావిస్తున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, 2 సార్లు రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన దిలీప్ రాయ్ ఈ ఎన్నికల్లో ప్రత్యక్ష పోరు సుందరగడ్ పార్లమెంటు స్థానంపై ప్రభావం చూపుతుందని విశ్లేషకుల అంచనా. ఈ ప్రాంతంలో ఆయన ప్రముఖ వ్యాపారవేత్త. బిజూ జనతా దళ్ వ్యవస్థాపక సభ్యుడు. నవీన్ పట్నాయక్‌తో విభేదించి బీజేడీ బహిష్కరణ వేటుకు గురయ్యారు. ఈ ఎన్నికల్లో సత్తా చాటుకునేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ లోగడ 21 లోక్‌సభ స్థానాలకు, 112 మంది శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసి జాబితా విడుదల చేసింది. తాజాగా మరో 21 మందితో ఎ మ్మెల్యే అభ్యర్థుల జాబితాని విడుదల చేసింది. రా ష్ట్రంలో 147 శాసన సభ నియోజక వర్గాలు ఉన్నా యి. ఈ లెక్కన బీజేపీ మరో 14 స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండగా..



నిత్యావసర సరుకులు అందించిన దాతలు

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం పలాస ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని ఓ జీడి పరిశ్రమలో పని చేసేవారు. అయితే వారిని పనిలో నుంచి తొలగించడంతో రోడ్డున పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన పవన్‌పుత్ర సేవా సంస్థ అండగా నిలిచింది. జగనన్నకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వారికి ఆశ్రయం కల్పించారు. అలాగే మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను మంగళవారం అందించారు. వారి పిల్లలను ప్రభుత్వ నడుపుతున్న బాలసదనంలో చేర్చుకునేందుకు అధికారులను సంప్రదించారు. కార్యక్రమంలో పవన్‌పుత్రసేవా సంస్థ ప్రతినిధులు కొల్లి ఫాల్గుణరావు, రుంకు తారకేశ్వరరావు, పిట్ట నీలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



తీవ్రగాయాల పాలైన తరుణ్

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ వీధికి చెందిన పడాల తరుణ్ అనే యువకుడిని మంగళవారం లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... తరుణ్ మెళియాపుట్టి జంక్షన్ వద్ద గల ఫ్లై ఓవర్ బ్రిడ్జీ రోడ్డుపైకి వెళ్లి ఫోన్ మాట్లాడుతుండగా శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. యువకుడి కుడికాలి తొడ భాగం నుజ్జునుజ్జయ్యింది. దీంతో అతడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడి స్నేహితులు ఇచ్చిన సమాచారం మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

నీలమణి తల్లికి పుష్పాభిషేకం



సారవకోట: మండలంలోని అవలింగి శ్రీ నీలమణి అమ్మవారికి మంగళవారం 10,116 గులాబీలతో పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ ఆలయంలో సోమవారం నుంచి జరుగుతున్న వసంత త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గులాబీలతో పుష్పాభిషేకం నిర్వహించినట్లు అర్చకులు చల్లపల్లి భాస్కరరావు ఆచారి తెలిపారు. బుధవారంతో ఈ ఉత్సవాలు ముగించనున్నట్లు వారు తెలిపారు.

స్విమ్మింగ్‌లో శిక్షణకు జమ్ము విద్యార్థి ఎంపిక



ప్రేమ్‌కుమార్‌ను సత్కరిస్తున్న చిట్టిబాబు

నరసన్నపేట: మండలంలోని జమ్ముకు చెందిన టెంక ప్రేమ్‌కుమార్‌కు యానాంలో రెసిడెన్షియల్ స్విమ్మింగ్ శిక్షణకు ఎంపికయ్యాడు. స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యానాంలో డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న క్యాంపునకు 21న హాజరు కావాలని సమాచారం వచ్చింది. దీంతో విద్యార్థితో పాటు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేటలో 9వ తరగతి చదువుతున్న ప్రేమకుమార్‌కు ఈ అవకాశం రావడం ఆనందంగా ఉందని వైఎంసీ కార్యదర్శి గొద్దు చిట్టిబాబు అన్నారు. మంగళవారం ప్రేమకుమార్‌ను చిట్టిబాబు సత్కరించి అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ సభ్యులు గ్రామస్తులు

సంతబొమ్మాళి: మండలంలోని కాపుగోదాయవలస గ్రామానికి చెందిన బి.జనార్దన్ మరణించడంతో ఆ కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు ఉపాధి హామీ కూలీలు, విదేశాల్లో ఉన్నవారు, గ్రామాల నుంచి నగదును సేకరించి రూ.1,35,500 మొత్తాన్ని మృతుడి భార్య కస్తూరికి అందజేశారు.

ప్రపంచ శాంతికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న రాజయోగిని బ్రహ్మకుమారి జయంతి

- రాజయోగిని బ్రాహ్మకుమారి మంజు

బరంపురం : ప్రపంచ దేశాల్లో అన్నిటికంటే భారత దేశ కళలు, సంస్కృతి గొప్పవని రాజయోగిని బ్రాహ్మకుమారి జయంతి చెప్పారు. మంగళవారం స్థానిక రామచంద్రపూర్, ప్రభూ ఉపహార్ రిక్రూట్ సెంట్రల్ హాలులో సోమవారం ప్రజాపతి బ్రహ్మ కుమారి ఈశ్వరీయా విశ్వ విద్యాలయం శాంతికుండా ఆధ్వర్యంలో జాతీయ కళా సంస్కృతి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజయోగిని బ్రాహ్మ కుమారి జయంతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రపంచ శాంతి కోసం మాట్లాడారు. ప్రపంచీకరణ రోజురోజుకూ మారుతోందన్నారు. ఆధిపత్యం కోసం ప్రపంచ దేశాలు పోరాడుతున్న ప్రస్తుత తరుణంలో ప్రపంచ శాంతి అవసరమని చెప్పారు. ఇందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రచారకర్త రాజయోగిగి బ్రహ్మకుమారీమాల మాట్లాడుతూ ప్రపంచ శాంతితో పాటు మనిషి ఆరోగ్యం కూడా అవసరమని చెప్పారు. ఇందుకు ప్రతిఒక్కరూ యోగ, ధ్యానం చేసి భగవంతున్ని స్మరించాలని పిలుపునిచ్చారు. యోగా నిత్యజీవితంలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో రాజయోగి సతీష్ బయ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న నగర ప్రముఖులు

ఘనంగా లింగరాజు రుకుణ యాత్ర



పుష్పాలంకరణలో లింగరాజు దేవస్థానం



లింగరాజు రుకుణ రథయాత్ర

భువనేశ్వర్: ఏటా అశోక అష్టమి పురస్కరించుకుని నిర్వహించే ఏకామ్ర క్షేత్రవాసుడు లింగరాజు మహా ప్రభువు రుకుణ రథ యాత్ర మంగళవారం సాయంత్రం ప్రారంభమైంది. ప్రధాన దేవస్థానం నుంచి రామేశ్వర ఆలయానికి రుకుణ రథం బయలుదేరింది. వేలాది మంది భక్తులు నీరాజనంతో స్వామి రథాన్ని లాగుతూ ముందుకు నడిపించారు. దారి పొడవునా పెద్దఎత్తున భక్తులు బారులు తీరారు. శాంతిభద్రతల పరిరక్షణకు కమిషనరేట్ పోలీసులు, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. యాత్ర జరిగే రథ్ రోడ్ మార్గంలో వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేశారు. మౌసి మా ఛక్ వైపు వెళ్లే వాహనాల్ని దారి మళ్లించారు. శాంతిభద్రతల పరిరక్షణలో 12 ప్లటూన్ బలగాలు, ఇద్దరు అదనపు డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లను మోహరించారు. 50 మందికి పైగా సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్‌ఐ, ట్రాఫిక్ అధికారులను రంగంలోకి దింపారు. మరోవైపు ఎండ, వడగాలులను దృష్టిలో ఉంచుకుని భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అడుగడుగునా చలివేంద్రాలు ప్రారంభించారు. వడదెబ్బ నివారణకు భక్తజనంపై చల్లని నీటిని పిచ్చికారి చేసి ఉపశమనం కల్పించారు. రుకుణ రథ యాత్ర పురస్కరించుకుని నిర్ధారించిన వేళల ప్రకారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రధాన దేవస్థానంలో నిర్వహించారు.

ఉత్సవాలకు శ్రీకారం



శుభరాట కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలోని సముటియా వీధిలో మావుల్లో సుందరీ అమ్మవారి పండగ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి శుభరాట వేశారు. ఐదేళ్లకోసారి ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పండగ సమయంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో వేడుకుంటే పిల్లలకు గాలిచల్లటం, జ్వరాలు, డయేరియా వంటి రోగాల నుంచి రక్షణ లభిస్తుందని భక్తుల నమ్మకం.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, కమిటీ సభ్యులు జానకీ బెహరా, కృష్ణ బెహరా, భరత్ భూషణ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టు ఇంట్లో చోరీ



బాధితులు పండా దంపతులు



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి మజ్జిగుడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న సింహాచల్ పండా ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు కళ్యాణసింగుపూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండా తన భార్యతో సొంత పనుల నిమిత్తం రాయగడ వచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి చూడగా బయట తాళాలు విరిగి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి వస్తువులను చిందరవందరగా పడేయడంతో పాటు బీరువాను విరగ్గొట్టి ఆరు తులాల బంగారు, 12 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మీ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించండి



గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తున్న అనుసూయ మాఝి

రాయగడ: 'మీ ఇంటి ఆడబిడ్డను.. నన్ను ఆశీర్వదించి ఎన్నికల్లో గెలిపించండి.. ఈ ప్రాంతం సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాను' అని రాయగడ శాసనసభ బీజేడీ అభ్యర్థి అనసూయ మాఝి హామీఇచ్చారు. జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరిలో మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. టికిరి సమితి కుచేయి పాదొరొలొ జన్మించిన అనసూయా మాఝి దివంగత మంత్రి అనంతరాం మాఝి కూతురు. ఇక్కడే పుట్టి పెరిగిన చనువుతో అందరినీ ఆప్యాయతగా పలకరించి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు కొంతొ మాఝి తదితరులు పాల్గొన్నారు.

కాశీపూర్ పైనే ఫోకస్

నియోజకవర్గంలో అంతర్భాగమైన కాశీపూర్ సమితిలో అత్యధికంగా ఆదివాసీలు నివాసముంటున్నారు. వారి ఓట్లను పొందేందుకు అనుసూయ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదే ప్రాంతం నుంచి 2019 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన మకరంద ముదిలి గెలుపునకు ప్రధాన కారణం ఈ సమితి ప్రజల ఆశీర్వాదబలమేనని విశ్లేషకుల అంచనా. అదే తరహా అనసూయ కూడా కాశీపూర్‌లోనే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

శ్లాబ్ కూలి వ్యక్తి మృతి



మేస్త్రీ దేబరాజ్ జెన్నా మృతదేహం



క్షతగాత్రుడ్ని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

బరంపురం : నగర సమీపంలోని సుర్లా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటి శ్లాబ్ కూలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఐఐసీ అధికారి కౌశిక్ మజ్జి తెలిపిన వివరాల ప్రకారం.. బరంపురం జిల్లా గోలాంతర పోలీసుస్టేషన్ పరిధిలోని సుర్లా గ్రామంలో ఇంటి నిర్మాణం జరుగుతోంది. మంగళవారం ఒక్కసారిగా శ్లాబ్ కూలిపోవడంతో మేస్త్రీ దేబరాజ్ జెన్నా(55) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో ఎంకేసీజీ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందుతున్నారు. గాయపడిన వారిని కమలోచన్ బెహరా, భరత్ బెహరా, సుకాంత్ బెహరా, నరసింహ బెహరాగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఐఐసీ అధికారి తెలిపారు.

రుణ కుంభకోణం కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఊరట

భువనేశ్వర్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కటక్ బారాబటి నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్‌కు సుప్రీం కోర్టు తాత్కాలిక ఉపశమనం కల్పించింది. దశాబ్దాల నాటి రుణ అక్రమాల కేసులో తదుపరి విచారణ ఈ నెల 22కు వాయిదా వేసింది. అంత వరకు లొంగిపోకుండా సుప్రీం కోర్టు మంగళవారం అతనికి మధ్యంతర ఉపశమనం ఇచ్చింది. ఈ కేసులో మహ్మద్ మొకీం, ఇతరులకు 3 ఏళ్ల జైలు శిక్ష విధించిన ప్రత్యేక విజిలెన్స్ కోర్టు తీర్పును ఒరిస్సా హైకోర్టు సమర్థించడంతో వారం రోజుల క్రితం శాసన సభ్యుడికి ఎదురుదెబ్బ తగిలింది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలను బలహీనపరిచింది. ఈ ఉత్తర్వును సవాల్ చేస్తు సుప్రీం కోర్టుని ఆశ్రయించడంతో ఈ మేరకు వాయిదా వేసింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఇంత వరకు కటక్ బారాబటి శాసన సభ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు.

మేడపై నుంచి పడి చిన్నారి మృతి

టెక్కలి రూరల్: మండలంలోని బన్నువాడ గ్రామానికి చెందిన రుంకాన శశిభూషణరావు అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి పంజాబ్‌లో ఉంటున్నాడు. వారి ఒక్కగానొక్క కుమారుడు సుశాంత్(8) సోమవారం ఇంటి మేడపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలుడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతి వార్తతో బన్నువాడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నెలరోజులు క్రితమే ఆ కుటుంబం స్వగ్రామానికి వచ్చింది. నెల గడవక ముందే ఇలా జరగడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

జయపురం: స్థానిక బెడా సాహిలో మా గంగమ్మ దేవి పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే వందలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. దీపారాధనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగు రోజుల పాటు అమ్మవారి పూజలు ఘనంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నవమి ఉత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ పూజ

భువనేశ్వర్: ఖుర్దారోడ్ ట్రాఫిక్ కాలనీ రామ మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. పంతుల రఘునాథ శాస్త్రి ఆధ్వర్యంలో దీక్ష ధారణ, ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భక్త సమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 25 వరకు నవమి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

జయపురం: ఉత్కళ సంబాదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిభూతి భూషణ్‌కర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు కళ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు వి.భాస్కరరావు, సభ్యులు గోపాలరావు, పరమేశ్వర రావు, దేవీప్రసాద్ మహంతి, మధుసూదన పాత్రో, కృష్ణ ఖొర, మనోజ్ దాస్, కిశోర్ సాహు తదితరులు పాల్గొన్నారు.

మోహనా.. గెలుపు దక్కేనా..!



ప్రశాంత్ మల్లిక్ (బీజేపీ)



దాశరథి గొమాంగో(కాంగ్రెస్)



అంతర్యామి గొమాంగో(బీజేడీ)

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఎస్టీ అసెంబ్లీ సెగ్మెంట్, బరంపురం లోక్‌సభా స్థానంలో భాగమైన మోహనా నియోజకవర్గంలో త్రిముఖ పోరు నెలకొంది. కాంగ్రెస్ సిటింగ్ ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, బీజేడీ నుంచి అంతర్యామి గొమాంగో, బీజేపీ తరపున ప్రశాంత్ మల్లిక్‌కు పార్టీ టిక్కెట్లు లభించాయి. ఇక్కడ విజయం సాధించేందుకు ముగ్గురు అభ్యర్థులు హోరాహోరీగా తలపడుతున్నారు.

రాయగడలో గెలుపెవరిదో..!



అప్పలస్వామి కద్రక



బసంత కుమార్ ఉలక



అనసూయా మాఝి

రాయగడ: రాష్ట్రంలోని రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బసంత కుమార్ ఉలక పేరును అధిష్టానం ఖరారు చేసింది. ఇప్పటికే ఈ స్థానంలో బీజేడీ నుంచి అనసూయా మాఝి, కాంగ్రెస్ నుంచి అప్పలస్వామి బరిలో ఉన్నారు. దీంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఇదే స్థానం నుంచి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బసంతకుమార్ ఉలక, అప్పలస్వామి కద్రకలు పోటీ చేసి ఓటమి చవిచూశారు. మళ్లీ ఆయా పార్టీల అధిష్టానం ఇద్దరికీ అవకాశం కల్పించింది. బీజేడీ నుంచి పోటీ చేస్తున్న అనసూయా మాఝి మొదటిసారిగా ఎన్నికల బరిలోకి దిగారు.

క్లుప్తంగా

20 ఎకరాల గడ్డివాములు దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన రుంకు అప్పలనాయుడు, వెంకన్న, వెంకటరమణ, శాసుబిల్లి రాంబాబులు కళ్లాల్లో పశువుల మేత నిమిత్తం ఉంచిన 20 ఎకరాలకు చెందిన గడ్డివాములు సోమవారం రాత్రి కాలిపోవడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటి విలువ రూ.2 లక్షల వరకూ ఉంటుందని రైతులు తెలిపారు. సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపకసిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు.

రెండు పశువుల శాలలు..



కాలిపోయిన పశువుల పాకలు, గడ్డివాము

జామి: మండలంలోని అలమండగ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాకలు, ఒక గడ్డివాము దగ్ధమయ్యాయి. అలమండ నుంచి నారాయణపురం వెళ్లే రహదారిలో ఉన్న యాళ్ల వారి చెరువు కళ్లాల వద్ద పశువుల పాకలు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో బీల చిన్నప్పలనాయుడు, మిడతాన అప్పలసత్యానికి చెందిన పాకలు, ఒక గడ్డివాము దగ్ధమయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.యాభై వేల ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. ఈ సమాచారం తెలుసుకున్న వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, ఉపసర్పంచ్ లగుడు దేముడు తదితరులు బాధితులను పరామర్శించారు.

జీడి మామిడి తోటల్లో అగ్నిప్రమాదం



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలంలోని వేపాడ రెవెన్యూలో రాయుడుపేట గ్రామ సమీపంలో ఉన్న జీడి, మామిడి తోటల్లో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సమచారం తెలుసుకున్న ఎస్.కోట అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు.

సైబర్ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: మొబైల్‌లో వచ్చిన మెసెజ్‌కు స్పందించి లింక్ ఓపెన్ చేసి, ఓటీపీ చెప్పడంతో బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదు విత్ డ్రా అయింది. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం కేసు నమోదు చేసి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రదీప్‌నగర్‌కు చెందిన ఎం.శేషుకుమారి సెల్ ఫోన్‌కు సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మెసెజ్ వచ్చింది. యాక్సిస్ బ్యాంక్ పేరుతో వచ్చిన మెసెజ్‌లో రివార్డ్ పాయింట్స్ పోతాయని, లింక్ ఆధారంగా వాటిని తీసుకోవాలని పేర్కొనడంతో ఆమె లింక్ క్లిక్ చేసి ఓపెన్ చేసింది. ఓటీపీ చెప్పడంతో ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.లక్షా 98వేల 645 నగదు మాయమైంది. దీంతో వెంటనే ఆమె వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

తెర్లాం: అత్యాచారం, మోసగించిన కేసులో ఓ నిందితునికి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.10వేలు అపరాధ రుసుం విధిస్తూ విజయనగరం 5వ ఏడీజే మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించి తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్ మంగళవారం రాత్రి తెలిపిన వివరాలు ఇలా... మండలంలోని రంగప్పవలస గ్రామానికి చెందిన ధమరసింగి రామకృష్ణ అదే మండలం వెలగవలస గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. అత్యాచారం చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై 2016లో తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో బాధిత యువతి ధమరసింగి రామకృష్ణపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఏఎస్ఐ బి.అప్పారావు కేసు నమోదు చేయగా, బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.గోవిందరావు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసును ప్రాధాన్యతా కేసుగా తీసుకొని ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి నిందితుడికి శిక్షపడేలా చర్యలు చేపట్టారు. పోలీస్‌ల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్రనాథ్ కోర్టులో వాదనలు వినిపించగా, బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు పర్యవేక్షణలో ఎస్ఐ రమేష్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ జనార్దన్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచడంతో నిందితుడికి శిక్ష పడింది.

38 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ గ్రామ శివారులో అక్రమంగా మద్యం బాటిల్స్ కలిగిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్సై డి రామగణేష్ తెలిపిన వివరాల ప్రకారం 38 మద్యం బాటిల్స్ కలిగిఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

రాములోరి పెళ్లికి రారండోయ్..!

- నేడే రామతీర్థంలో సీతారాముల కల్యాణం
- ప్రభుత్వ లాంఛనాలతో వేడుక
- అందరికీ ఆహ్వానం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు



ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవ విగ్రహాలు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థానికి పెళ్లి కళ వచ్చేసింది. శ్రీ సీతారాముల కల్యాణ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తజనం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. రామస్వామి వారి దేవస్థానం సమీపంలోని స్వామివారి కల్యాణ మంటపంలో బుధవారం ఉదయం 10.30గంటల నుంచి 12.30 గంటల వరకు సీతారామస్వామివారి పరిణయం జరగనుంది. కల్యాణం నిర్వహించే వేదికను సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తలంబ్రాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. గడిచిన వారం రోజుల నుంచే ఆలయ ప్రాంగణం కల్యాణ శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 25మంది రుత్విక్కులు నిర్విరామంగా పారాయణాలు నిర్వహించారు. లక్ష తులసీదళార్చన, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

- శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారాముల కల్యాణం బుధవారం నిర్వహించ నున్నారు. ఉదయం 10 గంటల నుంచి జరగనున్న సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చలువ పందిళ్లతో పాటు దర్శనం కోసం భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

ఎండ తీవ్రత దృష్ట్యా కల్యాణ ప్రాంగణంలో భారీ స్థాయిలో టెంట్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు అందించనున్నారు. సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో వైద్యశిబిరం, భక్తులకు అందించేందుకు తలంబ్రాలను సిద్ధం చేశారు. పెళ్లి వేడుక ముగిసిన వెంటనే తలంబ్రాలను పంపిణీ చేయడానికి ప్రత్యేక కౌంటర్లను కూడా ఏర్పాటు చేశారు.

> వరుడు: శ్రీరామయ్య
> వధువు: సీతమ్మ
> వేదిక: సీతారామస్వామివారి కల్యాణ మంటపం, రామతీర్థం
> సమయం: శ్రీ కోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి, ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకు
> సుముహూర్తం: 12గంటలకు అభిజిత్ లగ్నం
> అభ్యర్థన: వేద పండితుల వేదమంత్రోచ్చారణ నడుమ కనీవిని ఎరుగని రీతిలో జరిగే సీతారామచంద్ర ప్రభువు వివాహాన్ని కనులారా తిలకించి సీతాసమేత రామస్వామివారి అనుగ్రహాన్ని పొందాలని మనవి.

తిరుపతి నుంచి పట్టువస్త్రాలు

ఏటా జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలకు తిరుపతి నుంచి పట్టు వస్త్రాలు అందించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. తిరుమల దేవస్థానానికి చెందిన వేదపండితులు బుధవారం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసమూర్తి పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా గోటి తలంబ్రాల సేవ

శ్రీరామనవమి వేడుకల్లో స్వామివారి కల్యాణానికి గోటి తలంబ్రాలను వినియోగించనున్నారు. గడిచిన మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పలువురు భక్తులు గోటితో వలిచిన కోటి తలంబ్రాలను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. పవిత్ర తలంబ్రాలు రామతీర్థం శ్రీరామస్వామివారి దేవస్థానానికి ఇటీవల చేరుకున్నాయి.

దేవస్థానానికి చేరుకోవడం ఇలా..

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి 20కిలోమీటర్లు ప్రయాణం చేసి రామతీర్థం చేరుకోవచ్చు. ఆటోల్లో వచ్చే వారు కోట జంక్షన్ నుంచి నెల్లిమర్లలోని రామతీర్థం జంక్షన్‌కు చేరుకుని అక్కడి నుంచి 5కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రణస్థలం నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణం చేసి సతివాడ మీదుగా రామతీర్థానికి చేరుకోవాలి.

స్వామివారి దర్శనం ఇలా..

ఆలయ ఉత్తర రాజగోపురం ద్వారా రూ.50 టికెట్లు తీసుకునే భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఉచిత దర్శన కార్యక్రమాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

- శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం అధికారులు వివిధ రకాల సదుపాయాలను కల్పించారు.
- పార్కింగ్: ఆలయ ప్రాంగణం వద్ద, కల్యాణ వేదిక ప్రారంభం వద్ద
- తలంబ్రాల కౌంటర్: స్వామివారి కల్యాణ వేదిక వద్ద ఎడమ భాగాన
- ప్రాథమిక చికిత్స కేంద్రం: కల్యాణ వేదిక ప్రాంగణం
- ప్రసాదాల కౌంటర్: తూర్పు రాజగోపురం వద్ద

వీటితో పాటు ఎప్పటికప్పుడు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సీతారాముల కల్యాణ వేదిక



ప్రధాన ఆలయం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు



రామతీర్థం దేవస్థానం

గట్టి బందోబస్తు ఏర్పాటు



శ్రీరామనవమి రోజున రామతీర్థంలో గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. అందరి అధికారుల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. 150మంది పోలీసులతో పాటు ఒక డీఎస్పీ స్థాయి అధికారి, పది మంది ఎస్సైలు, ఐదుగురు సీఐలు విధులు నిర్వహించనున్నారు. సుమారు 15వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. కల్యాణం సజావుగా సాగేందుకు భక్తులు సహకరించాలి.

– రామగణేష్, ఎస్సై, నెల్లిమర్ల

ఏర్పాట్లు పూర్తి చేశాం



ప్రభుత్వ లాంఛనాలతో స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కల్యాణ వేదిక వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం. భక్తుల కోసం 10వేల లీటర్ల మజ్జిగను సిద్ధం చేశాం. తలంబ్రాల పంపిణీకి ప్రత్యేక క్యూల ఏర్పాటు, ఉచిత ప్రసాదాల పంపిణీ తదితర సౌకర్యాలను అందిస్తున్నాం.

– వై శ్రీనివాసరావు, ఈఓ, రామదేవస్థానం



సిద్ధమైన తలంబ్రాల పంపిణీ కేంద్రం

అభిజిత్ లగ్నంలో స్వామి కల్యాణం



శ్రీరామనవమి సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. ఉదయం 10 గంటల సమయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకువెళ్తాం. అనంతరం విశేష పూజలు నిర్వహించి సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం పెట్టించి స్వామి కల్యాణాన్ని వేడుకగా జరిపిస్తాం.

– సాయి రామాచార్యులు, ప్రధాన అర్చకుడు, రామతీర్థం



సిద్ధమైన కల్యాణ వేదిక ప్రాంగణం

దాసరికి ఉగాది స్వర్ణ నంది పురస్కారం



ఉగాది స్వర్ణ నంది పురస్కారం అందుకుంటున్న సినీనటుడు దాసరి తిరుపతినాయుడు

విజయనగరం టౌన్: ప్రముఖ చలన చిత్ర నటుడు, డ్రామా ఆర్టిస్ట్ దాసరి తిరుపతినాయుడుకు ఉగాది స్వర్ణ నంది పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని ఆదర్శ కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో మూడురోజుల కిందట నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఓఎస్‌డీ డాక్టర్ ఎమ్.ప్రభాకర్, సినీనటుడు మానిక్, తదితరుల చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఆయనకు స్వగ్రామమైన బాడంగి మండలం గొల్లాది వాసులతో పాటు అభిమానులు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో జనసేన ప్రచారం

- నిబంధనలకు విరుద్ధంగా పాలకొండ అభ్యర్థి జయకృష్ణ



ఆర్‌టీసీ బస్సులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ

వీరఘట్టం: ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వాహనాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు. అయితే పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ అసెంబ్లీ జనసేన అభ్యర్థి ఆర్టీసీ బస్సులో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికల నిబంధనలను తోసిరాజని తనకు నచ్చినట్లు ప్రచారం చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన భామిని మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా అటుగా వచ్చిన ఆర్‌టీసీ బస్సులోకి ఎక్కి ప్రచారం చేస్తూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారు. తక్షణమే ఎన్నికల అధికారులు జయకృష్ణ ప్రచారంపై విచారణ చేసి తగుచర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు. ఇదే విషయంపై పాలకొండ ఆర్‌టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు వద్ద సాక్షి ప్రస్తావించగా జయకృష్ణ ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న ఫొటో పాలకొండ ప్రెస్‌గ్రూప్‌లో చూశానన్నారు. వాస్తవానికి భామిని మండలంలో పాలకొండ డిపో బస్సులు తిరగడం లేదని, అక్కడ శ్రీకాకుళం డిపో బస్సులు తిరుగుతున్నట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం ఆర్టీసీ బస్సు ఎక్కి ఎన్నికల ప్రచారం చేయకూడదని, ఈ విషయాన్ని శ్రీకాకుళం డిపో మేనేజర్‌కు తెలియజేస్తామన్నారు.

8కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు

పార్వతీపురంటౌన్: 8 కేజీల గంజాయితో పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలోని చినమాదిగ వీధి ప్రాంతంలో నివాసం ఉంటున్న నిడగంటి జ్యోతి గంజాయి విక్రయాలు జరుపుతోందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఆమె నివాసం వద్ద ఈ సందర్భంగా 8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న నక్కా వెంకటేష్, ఆమె వద్ద ఉంటున్న సహాయకుడు రోహిత్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై సంతోషి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరంలో మరో ఎనిమిది కిలోలు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తి దగ్గర ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపారు. రైల్వేస్టేషన్ ఆవరణలో తనిఖీలు చేపడుతున్న ఎస్సై హరిబాబునాయుడు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారి దగ్గర గంజాయి స్వాధీనం చేసుకుని డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో సీజ్ చేశారు. గంజాయి రవాణా చేస్తున్న మహారాష్ట్రకు చెందిన పింటూ అంబుదాస్ పిండేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు జువైనల్ అని సీఐ చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో 33 కిలోల గంజాయి

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైళ్ల తనిఖీలు ముమ్మరంగా చేస్తున్న జీఆర్‌పీ పోలీసులు మంగళవారం రూ.లక్షా 65వేల విలువైన 33 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్-1లో మహారాష్ట్రకు చెందిన శశికాంత్ చంద్రకాంత్ థోరట్, ఒడిశాకు చెందిన పాదలమ్‌ఖారాలు జైపూర్ నుంచి విజయనగరం బస్‌లో చేరుకుని విజయనగరం నుంచి విశాఖ, అక్కడ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని రవాణాచేయడానికి సిద్ధమయ్యారు. జీఆర్‌పీ సిబ్బంది తనిఖీల్లో భాగంగా రైల్వేస్టేషన్‌లో వారి దగ్గర గంజాయి ఉన్నట్లు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు లైన్స్ సీఐ వెంకటరావు తెలిపారు. ఎస్సై రవివర్మ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతమ్మకు బంగారు శతమానాలు



సీతమ్మ తల్లికి బంగారు శతమానాలు సమర్పిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి వెంకటరమణి

విజయనగరం: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని విజయనగరం చిక్కాలవీధి రామ మందిరంలోని సీతమ్మతల్లికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సతీమణి కోలగట్ల వెంకట రమణి బంగారు శతమానాలను మంగళవారం సమర్పించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. పూజల్లో వనజ, రత్నం, కందుకూరి రాణి తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్, శంబర కృష్ణలు శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చనలను వనంగుడి, చదురుగుడిలలో నిర్వహించారు. అమ్మవారికి బూరెలతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ.ప్రసాదరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

సివిల్స్ విజేతగా పార్వతీపురం కుర్రోడు

- సివిల్స్ ఫలితాల్లో 493వ ర్యాంకు
- మూడో ప్రయత్నంలోనే సాధించిన దొనక పృథ్వీరాజ్



తల్లిదండ్రులతో సివిల్స్ విజేత పృథ్వీరాజ్

పార్వతీపురం టౌన్/కురుపాం: పార్వతీపురం కుర్రోడు.. సివిల్స్‌లో సత్తా చాటాడు. ఆలిండియా స్థాయిలో 493వ ర్యాంకు సాధించాడు. మూడో ప్రయత్నం.. రెండో ఇంటర్వ్యూలోనే.. ఎటువంటి కోచింగ్ కూడా తీసుకోకుండానే లక్ష్యాన్ని అందుకోవడం విశేషం. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ – 2023 తుది ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో పార్వతీపురం పట్టణంలో నివాసం ఉంటున్న దొనక విజయ్‌కుమార్, వెంకటరత్నంల కుమారుడు 23 ఏళ్ల దొనక పృథ్వీరాజ్ ఉత్తమ ర్యాంకు సాధించాడు. దీంతో ఆ కుటుంబంలో సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడిన పృథ్వీ.. లక్ష్యం కోసం రోజుకు 8 గంటలకుపైగా కష్టపడ్డానని చెప్పాడు. అతని మాటల్లోనే...

తండ్రిని చూసి స్ఫూర్తి పొందా..

మాది స్వప్రాంతం కురుపాం. చిన్నతనంలోనే పార్వతీపురం వచ్చి స్థిరపడ్డాం. అప్పట్లోనే నాన్న ఎంఈఓగా పని చేశారు. ప్రభుత్వ శాఖల్లో పరిపాలన, ప్రజలకు సేవ చేసే విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. అప్పటి నుంచి ప్రభుత్వ సర్వీసుల్లోకి రావాలని అనుకున్నా. పదో తరగతి వరకు పార్వతీపురంలో, ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో చదివా. ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్(ఆర్ట్స్) చదువుతున్నప్పుడే పూర్తిస్థాయిలో సివిల్స్‌పై దృష్టి సారించా.

కోచింగ్ లేదు.. ఇంటి వద్దే కష్టపడ్డా

సివిల్స్ లక్ష్య సాధన కోసం ఎక్కడా ప్రత్యేకించి కోచింగ్ తీసుకోలేదు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆప్షనల్‌గా తీసుకున్నా. రోజుకు 8 గంటలు ఇంటి వద్దే ఉండి కష్టపడి చదివా. పరీక్షల సమయంలోనే 10–11 గంటల సమయం వెచ్చించా. మూడో ప్రయత్నంలోనే సాధించా. ఇది రెండో ఇంటర్వ్యూ. ఎక్కువగా మెయిన్స్ మీద దృష్టి సారించా. ఈ ఏడాది స్కోరింగ్ రావాలని కష్టపడ్డాను. ప్రజెంటేషన్, ఇతర అంశాలపై దృష్టి సారించి విజయం సాధించాను. సివిల్స్ లక్ష్యంగా చదువుతున్న వారూ ఇదే దృష్టిలో పెట్టుకుంటే మంచిది. త్వరగా గమ్యం చేరుకోవచ్చు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...

నా విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. వారు అడుగడుగునా అండగా నిలిచారు. ప్రస్తుతం నాన్న ఎం.ఆర్.నగరం జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్‌ఎంగా చేస్తున్నారు. అమ్మ ప్రభుత్వ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

సివిల్స్‌లో సత్తాచాటిన పెదవేమలి కుర్రాడు



ర్యాంక్ సాధించిన భార్గవ్

గంట్యాడ: సివిల్స్‌లో పెదవేమలి గ్రామానికి చెందిన పాటుపురెడ్డి భార్గవ్ సత్తా చాటాడు. మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 590 సాధించాడు. గతేడాది ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 772 ర్యాంక్ సాధించి ముస్సోరిలో ఐఆర్‌ఎస్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఈ ఏడాది మళ్లీ పరీక్షకు సిద్ధమై మంచి ర్యాంకు సాధించాడు. ఆయన తల్లి పద్మ గృహిణికాగా, తండ్రి సత్యం విజయనగరం ఆర్టీసీలో సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నారు. చెల్లి కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ ప్రిపరేషన్‌లో ఉంది.

చాలా ఆనందంగా ఉంది..



మా అబ్బాయికి సివిల్స్ ఫలితాల్లో 590 ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఓబీసీ కోటాలో ఐపీఎస్ వచ్చే అవకాశం ఉంది. మొదటి నుంచి చదవులో ముందుండేవాడు. అందుకు అనుగుణంగా మా అబ్బాయిని ప్రోత్సహిస్తూ వస్తున్నాం. మా నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ర్యాంకు తేచ్చుకోవడం సంతోషంగా ఉంది. – పాటుపురెడ్డి సత్యం, పద్మ (భార్గవ్ తల్లిదండ్రులు)

నామినేషన్లకు 13 రకాల డాక్యుమెంట్లు తప్పనిసరి : పీఓ

సాలూరు: నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలని, ఆ డాక్యుమెంట్లన్ని సక్రమంగా ఉంటే నామినేషన్లు అనుమతించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ నెల 18 నుండి నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ఏర్పాట్లును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. నాటి నుండి ఈ నెల 25 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, 26న నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందని అన్నారు.